ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 24 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (సోమవారం సాయంత్రం)
సహర్ 4:57 (మంగళవారం ఉదయం)

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలకు చెందిన 171మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోదావరిఖనిలో వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లక్ష్మీ నగర్ వ్యాపార కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. తహసీల్దార్ కుమారస్వామి, నాయకులు రాజేష్, మహంకాళి స్వామి, పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనాలి

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి సమీపంలో నిర్మించిన రేణుకదేవి ఎలమ్మ ప్రతిష్ఠాపనను ఏప్రిల్ 2, 3, 4తేదీల్లో నిర్వహిస్తామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను గౌడ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. మేరుగుహన్మంతుగౌడ్, రాజమల్లుగౌడ్, కోట రవి, స్వామి, శ్రీనివాస్, జనగామ శ్రీనివాస్, పాల్గొన్నారు.



మహిళలకే వ్యవసాయ యాంత్రీకరణ

- రాష్ట్ర వ్యాప్తంగా 10,812 మంది లబ్ధిదారులకు రూ. 24.90 కోట్ల సబ్సిడీ
- 50 శాతం సబ్సిడీపై పనిముట్లు, యంత్రాలు
- మహిళా రైతులకు ప్రాధాన్యం

వ్యవసాయ రంగంలోనూ యంత్రాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరుగుతున్న కొద్ది కూలీల కొరత ఏర్పడుతోంది. దీనిని అధిగమించేందుకు వివిధ రకాల యంత్రాలు వస్తున్నాయి. యంత్రాలను వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఈసారి మహిళలకే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వ్యవసాయ రంగంలో యేటా చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా సాగులో ఆధునిక పనిముట్లను వినియోగిస్తున్నారు. వీటిని సబ్సిడీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఎనిమిదేళ్ల తర్వాత ప్రారంభానికి నోచుకొంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం 24కోట్ల 90లక్షల రూపాయల సబ్సిడీని రైతులకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తు న్నది. రాష్ట్ర వ్యాప్తంగా 10,812 మంది లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీ సొమ్మును అందజేయనున్నారు. ఈసారి మహిళలకే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఇవ్వా లని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా కేటా యింపులు కూడా చేశారు.

వ్యవసాయ రంగంలోనూ యంత్రాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. వరి నాటు వేసే యంత్రం, వరి కోత మిషన్, మొక్కజొన్న పంటను కోయడం, కంకులు పట్టడం ఇలా పలు రకరకాల యంత్రాలు విని యోగంలోకి వస్తున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తు న్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా వివిధ రకాల యంత్రాలు, పనిముట్లపై 40 నుంచి 70 శాతం వరకు సబ్సిడీ ఇస్తోంది. ఈ పథ కానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ యాం త్రీకరణ పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే అమలు చేస్తోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధి కారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభు త్వం కూడా 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని కొనసాగించింది. అన్ని రకాల పనిముట్లకు బదులు ట్రాక్టర్లు, మినీ ట్రా క్టర్లు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం సబ్సిడీపై, ఇతరు లకు 50 శాతం సబ్సిడీపై ట్రాక్ట ర్లను అందజేశారు. ఈ పథకం ద్వారా అధికంగా పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చడంతో విమర్శలు వెల్లువెత్తాయి. అర్హులు కాని వారికి కూడా సబ్సిడీపై ట్రాక్టర్లను అందజేశారు. ఈ పథకంలో గులాబీ నేతల జోక్యం పెరగడంతో అర్హులైన లబ్ధిదారులకు ట్రాక్టర్లు అందకుండా పోయాయి. రైతుల్లో ప్రభుత్వ తీరుపై

(మిగతా 8వ పేజీలో)

నెలాఖరులోగా దరఖాస్తుల స్వీకరణ

ఈ నెలాఖరులోగా మహిళా రైతుల నుంచి దర ఖాస్తులు స్వీకరించనున్నారు. ఆయా మండలాలకు చేసిన కేటాయింపులను అనుసరించి లక్ష రూపాయల లోపు యూనిట్ ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారి కన్వీనర్‌గా ఉన్న కమిటీ, లక్షకు మించితే కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. పవర్ స్ప్రేయర్లు, డ్రోన్లు, రోటోవేటర్లు, సీడ్‌కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్లు, ప్లవ్, కేజ్‌వీల్స్, రోటో పడ్లర్లు, బండ్ ఫార్మర్ యూనిట్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్లు, మొక్కజొన్న వొలిచే షెల్లర్లు, తదితర యంత్రాలు, పనిముట్లను అందజేయ నున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత వ్యవసాయ యాంత్రీకర ణకు ప్రభుత్వం సబ్సిడీ నిధులు కేటాయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఊరూరా పోచమ్మ బోనాలు


ఖని ప్రధాన చౌరస్తాలోని పోచమ్మగుడి వద్ద బారులుతీరిన భక్తులు

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ/సుల్తానాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగకు ముందు ప్రజలు పోచమ్మ బోనాలను నిర్వహిస్తారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రజలు బోనాలు సమర్పించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాతోపాటు ఫైవింక్లయిన్, విఠల్‌నగర్, ఐబీ కాలనీ, తిలక్‌నగర్, బాపూజీనగర్, గంగానగర్ పోచమ్మ దేవాలయాల్లో ఉదయం నుంచే భక్తులు బోనాలు సమర్పించడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ కాలనీల నుంచి మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయాలకు చేరుకున్నారు. ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కాలనీవాసులు మేకలను, కోళ్లను బలిచ్చారు. కుటుంబాలు సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

కాగా, కార్పొరేషన్ అధికారులు ఆలయాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులుపడ్డారు. షామియానాలు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. ఎండ వేడికి తట్టుకోలేక, మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సుల్తానాబాద్ పట్టణంలోని వివిధ కులాలకు చెందిన ప్రజలు పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. ఉగాది పండుగ కు ముందు అన్ని కులాలకు చెందిన వారు పోచమ్మ, ఎల్లమ్మ తల్లులకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఆదివారం పట్టణంలోని వాడ వాడలా మహిళలు తమ కుటుంబ సభ్యులతో బోనాలు తీసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


సుల్తానాబాద్ లో పోచమ్మ తల్లికి బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

నిలువ నీడలేని రైల్వేస్టేషన్లు

- సౌకర్యాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- జీఎంలకు వినతులు ఇచ్చినా స్పందన కరువు
- కానరాని తాగునీరు, మరుగుదొడ్లు 7
- ఎండ, వానలతో ప్రయాణికుల ఇబ్బందులు


నీడలేని ఓదెల రైల్వేస్టేషన్

భావితరాలకు స్ఫూర్తి సర్దార్ భగత్‌సింగ్

- ఖనిలో కాగడాల ప్రదర్శన 8


కాగడాల ప్రదర్శన చేస్తున్న పీవైఎల్ నాయకులు

పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దు


చీకురాయిలో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం చీకురాయి, భోజన్నపేట, హన్మంతునిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాలవర్షంతో వరి, మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని, తక్షణమే నష్టం అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పదేళ్ళు అధికారంలో ఉన్న వారు నష్టపోయిన రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రస్తుతం తాము రైతులు నష్టపో కుండా కృషి చేస్తున్నామన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకున్నామని, గుంట భూమి కూడా ఎండిపోకుండా నీరందించేందుకు కృషి చేస్తాన న్నారు. రైతులు తూములు, కెనా ల్ కాలువ గేట్లను ధ్వంసం చేసి నీరును వృథా చేయవద్దన్నారు. అలా చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నారు. రైతులు, వ్యవసాయ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని అండగా ఉంటానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు భరోసా ఇచ్చారు. ధూళికట్టలో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, పత్తి పంటలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, ఏవో ఉమాపతి, ఏఈవోలు గణేష్, సురేష్, నాయకులు దేవరాజ్, పాల శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కోనరావుపేట, జూలపల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షంతో నష్టపోయిన మొక్కజొన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. సాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, నాయకులు జలపతిరెడ్డి, కొమురయ్య, మల్లయ్యస్వామి, పొట్యాల బీరయ్య రైతులు పాల్గొన్నారు.


ధూళికట్టలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ధర్మ పరిరక్షణ హితమే భగవద్గీత సారాంశం

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కడం హర్షణీయం : మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

మంథని, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ధర్మ పరిరక్షణకు భగవద్గీత ఆవిర్భవించిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శివకిరణ్ గార్డెన్స్‌లో రాష్ట్ర సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సామూహిక గీతా పారాయణంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడారు. సమాజంలో శాంతి స్థాపన కోసం భగవద్గీతను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. కష్టాల్లో, నష్టాల్లో, బాధలో, సంతోషంలో సైతం భగవద్గీత చదవడం వలన ఆత్మస్థైర్యం కల్గుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో హింస, నేర ప్రవృత్తి పెరుగుతుందని, వాటిని నియంత్రించడానికి భగవద్గీత తరుణోపాయంగా పని చేస్తుందన్నారు. సామూహిక భగవద్గీత పారాయణాల వలన ప్రజలకు, ఈప్రాంతానికి శుభ ఫలాలు కల్గుతాయని ఆశా భావం వ్యక్తం చేశారు. పారాయణ ఫలాలు రాష్ట్రంలోని ప్రజలందరికీ అంది వారంతంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మంథనిలో 665 రోజుల పాటు 665 ఇండ్లలో గీతా పారాయణం జరగడం సంతోషకరమన్నారు. భగవద్గీత పారాయణానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డు రావడం సంతోషకరమన్నారు. దీని కోసం కృషి చేసిన వారందనికి అభినందనలు తెలిపారు. స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి భగవద్గీత ప్రత్యేక రథంలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. వీరిని ఉద్దేశించి పలువురు స్వామిజీలు ప్రసంగించారు. కార్యక్రమానికి వొడ్నాల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా నిర్వాహకులు మంథెన శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, మేడగోని రాజమౌళిగౌడ్, దాసరి రాజేశం, పార్వతీ టీచర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- గోదావరిఖనిలో నిర్వహణ
- వన్ నేషన్...వన్ ఎలక్షన్‌పై యువ గళం

నాయకత్వ లక్షణాల పెంపునకు
యూత్ పార్లమెంట్



కోల్‌సిటీటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): యువతలో నాయకత్వ లక్షణాలను పెంపు... ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొని వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై మూడు నిమిషాలకు మించకుండా వారి అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. సుమారు 200 మందికి పైగా యువత పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో యువత అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ముందుకు వస్తున్నది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై యువత గళాన్ని వినిపిస్తున్నది. యూత్ పార్లమెంట్‌లో పాల్గొని అభిప్రాయాలను వ్యక్తం చేసిన యువతను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

ముగ్గురి అభిప్రాయాలు, సలహాలకు చోటు...

యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో దేశం మొత్తం నోడల్ జిల్లాలు 300 కాగా నోడల్ జిల్లాలో మొత్తం పది మందిని ఎంపిక చేస్తారు. అందులో రాష్ట్రంలో 13 నోడల్ జిల్లాల నుంచి ఎంపికైన 130 మందిని రాష్ట్ర స్థాయికి అక్కడి నుంచి నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి పంపిస్తారు. ఇలా దేశం మొత్తం నుంచి 90 మంది యువతను ఎంపిక చేసి ఈ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం కలుగుతుంది. యువత అభిప్రా యాలను, సలహాలను దేశాభివృద్ధి పాలసీలోకి పరిగణలోకి తీసుకొని పొందుపరుస్తారు. 2047 సంవత్సరానికి వందేళ్ళ స్వతంత్ర భారతదేశంలో యువత సామర్థ్యాలను, యువ నైపుణ్యాలను మరింత అభివృద్ధి చెందేం దుకు దోహదపడతాయని వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఉద్దేశ్యం.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలే కీలకం
నిక్షిత, డిగ్రీ విద్యార్థిని

యూత్ పార్లమెంట్ కార్యక్రమంతో రాజకీయాలు, ఎన్నికలపై అవగాహన కలుగుతుంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలే కీలకమైన పాత్ర పోషిస్తాయి. సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే దేశ భవిష్యత్ బాగుంటుంది.



యువత ఆలోచనలను తీసుకోవడం బాగుంది
- ఎ.శాంతిప్రియ

ఒక దేశం... ఒక ఎన్నికపై యువత ఆలోచనలను తీసుకోవడం బాగుంది. విద్యార్థి, యువతలో రాజకీయాలపై ఆసక్తి కలుగుతుంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల సమయం, ఆదాయాన్ని ఆదా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.



యూత్ పార్లమెంట్‌తో చాలా ఉపయోగం
- ఎస్.నీలారాణి



వన్ నేషన్, వన్ ఎలక్షన్ ద్వారా దేశానికి ఏరకంగా ఉపయోగం అనేది యూత్ పార్లమెంట్ ద్వారా అభిప్రాయాలను తీసుకోవడం బాగుంది. విద్యార్థి, యువతలో ఎన్నికల ప్రాధాన్యం తెలుస్తున్నది. సరైన నాయకుడిని ఎన్నుకోవడం, యువత రాజకీయాల్లోకి రావడం వల్ల దేశంలో మార్పులు వస్తాయి.

యూత్ పార్లమెంట్‌తో రాజకీయాలపై ఆసక్తి
- జి అజయ్‌కుమార్, పీజీ విద్యార్థి



యూత్ పార్లమెంట్ కార్యక్రమం ద్వారా యువత అభిప్రాయాలను తీసుకోవడంతో వారిలో రాజకీయాలపై ఆసక్తి పెరుగుతుంది. మాట్లాడే శక్తి, ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందుతుంది. ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల ప్రజాస్వామ్యంలో మార్పు రాదు. అదనపు భారం పడే అవకాశం ఉంటుంది.

దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం
సాంబశివరావు, నోడల్ అధికారి, యూత్‌పార్లమెంట్



యువతలో ప్రజాసమస్యల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం కోసం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ముఖ్య ఉద్దేశ్యం. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలలో ఎంపికైన యువతను జాతీయస్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయికి వెళ్ళిన వారు ప్రధాన మంత్రి, ఇతర పాలకులతో చర్చించడంతోపాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ యువత అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని దేశాభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ పాలసీలో పొందుపరుస్తారు. యువతకు యూత్ పార్లమెంట్ మంచి అవకాశం కల్పించింది.

తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ

వెల్గటూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం పైడిపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పైడిపల్లి గ్రామానికి చెందిన గుడికందుల తిరుపతి ఇంటిలో రెండున్నర తులాల బంగారం, గుడికందుల రాజేశం ఇంటిలో రూ.80 వేలు దొంగిలించారు.

గుడికందుల తిరుపతి పైడిపల్లిలో ఇంటికి తాళం వేసి వ్యాపారం నిమిత్తం కరీంనగర్‌లో ఉంటున్నాడు. రాజేశం ముంబైలో ఉంటున్నాడు. రెండు ఇళ్లకు తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు శనివారం అర్థరాత్రి ఇద్దరి ఇళ్ల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంటిలోని బీరువాలను పగులగొట్టి అందులోని బంగారం, నగదు దోచుకెళ్లారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించిన ఇరుగుపొరుగు వారు తిరుపతి, రాజేశంలకు సమాచారం ఇచ్చారు. తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. కాగా పోలీసులు ఆదివారం డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి వేలిముద్రలు సేకరించారు.

సెల్‌ఫోన్ అందజేత

ఓదెల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పోయిన సెల్‌ఫోన్‌ను సీఐఆర్ యాప్ ద్వారా గుర్తించి ఎస్‌ఐ రికవరీ చేశారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓదెలకు చెందిన బాధితుడు శ్రీనివాస్‌కు ఎస్‌ఐ దీకొండ రమేష్ సెల్‌ఫోన్‌ను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యం.. దైన్యం..

- శిథిలావస్థలో పశు వైద్యశాల
- మూగజీవాలపై పట్టింపు కరువు
- మండలంలో ఒక్కరే కాంట్రాక్టు సిబ్బంది
- పట్టించుకోని పాలనాధికారులు



శిథిలావస్థలో ఉన్న ఉప పశు వైద్యశాల

వీర్నపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలంలో పశువైద్యశాలలో సరైన సౌకర్యాలు, సరిపడా డాక్టర్లు లేక మూగజీవాలకు వైద్యం అందడం లేదు. మండల పరిధిలోని 17 గ్రామాలతో పాటు చిన్నచిన్న తండాలున్నాయి. ఈ మండలంలో ఎక్కువ సంఖ్యలో గిరిజనులు ఉన్నారు. కొంత మంది గిరిజనులు ఆవులు, మేకలు, గొర్రెలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తండాల్లో ఒక్కొక్కరు పదుల సంఖ్యలో మూగజీవాలను పెంచుతూ వాటిపైనే ఆధారపడి బతుకుతున్నారు. ఏ గ్రామం, తండాలోనైనా పశువులకు ఎలాంటి వ్యాధి సోకినా స్థానికంగా ఉన్న పశువైద్యశాలకు రావాల్సిందే. ఇక్కడ మాత్రం వచ్చిన రైతులు, పశువులకు ఎలాంటి సౌకర్యాలు లేక.. డాక్టర్లు లేక.. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉంది. ఈ విషయంపై పలు సందర్భాల్లో అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది. నూతన భవనాన్ని నిర్మించి, సరిపడు డాక్టర్లను కేటాయించి మూగజీవాలకు సరైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం మండలానికి పశువైద్యశాలను కేటాయించాలని రైతులు కోరుతున్నారు.


తుప్పు పట్టిన టేబుళ్లు, కుర్చీలు

● మండలానికి ఒకే ఒక కాంట్రాక్టు సిబ్బంది..

మండలంలోని 17 గ్రామాలు, చిన్నచిన్న తండాలకు కలిపి ఒకే ఒక కాంట్రాక్టు వెటర్నరీ సిబ్బంది ఉండడంతో ఏ గ్రామానికి వెళ్లినా పశువైద్యశాలకు వచ్చే రైతులు ఆయన కోసం వేచిచూడాల్సిందే. ఒకరే ఉండడం వల్ల అత్యవసర సమయాల్లో వైద్యం అందక మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధానంగా వైద్యశాలకు సరిపడా సిబ్బందిని కేటాయించి పశువులకు ప్రత్యేకంగా వైద్యం అందించాలని తీసుకున్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. పశువుల వైద్యం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్ చూపుతున్నా వాటికి వైద్యం అందించే డాక్టర్లుగానీ, మందులు అందుబాటులో లేకపోవడం రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్యశాలలో కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడంతో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సిబ్బందిని కేటాయించాలి..

- భూక్య వర్జియా నాయక్, లొద్దితండా, పశువుల కాపరి



నాకు 20 పశువులు ఉన్నాయి. మండల పశు వైద్యశాలలో ఒకే ఒక డాక్టర్‌తో కాలం వెళ్లదీస్తున్నారు. గిరిజన గ్రామీణ ప్రాంతమైన వీర్నపల్లిలో పశువులు ఎక్కువగా ఉన్నాయి. వీటికి సరిపడా డాక్టర్లను, సిబ్బందిని కేటాయించాలి. సమయానికి మందులు అందుబాటులో ఉంటలేవు. ఉన్నతాధికారులు పట్టించుకొని మూగజీవాలు మృత్యువాత పడకుండా చూడాలి.

ప్రతిపాదనలు పంపాం..

- రాహుల్, మండల పశువైద్యాధికారి, వీర్నపల్లి



మండలంలోని ఉప పశువైద్యశాలలో సరిపడా సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నూతన భవనాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాంట్రాక్టు పద్ధతిన ఒక అసిస్టెంట్ సిబ్బంది ఉన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. ఉపవైద్యశాలలో అన్ని సౌకర్యాలను కల్పిస్తాం.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు

కోనరావుపేట మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం శివంగలపల్లె కోనరావుపేట మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాల య్యాయి. మండలంలోని వెంకటరావుపేట గ్రామానికి చెందిన సందు రంజిత్, తల్లి కనకవ్వలు బైక్‌పై వెంకట్రావుపేట గ్రామానికి వస్తుండగా కల్వర్టుకు ఢీకొని కింద పడ్డారు. తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం, నిందితుడితో పోలీసులు

కరీంనగర్ క్రైం/వీణవంక మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామశివారులో ఆదివారం కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. డీసీఎం వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి వ్యాన్‌ను పట్టుకుని తనిఖీ చేయగా 160 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. బియ్యం హుజూరాబాద్ మండలం శాలపల్లి గ్రామానికి చెందిన గద్దల రవి వర్మ(26) తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకుని విచారణ నిమిత్తం వీణవంక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

పుణ్య స్నానానికి వచ్చి అనంత లోకాలకు..

- గోదావరిలో పడి యువకుడి మృతి

వెల్గటూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుణ్యస్నానానికి వచ్చిన శ్రీమంతుల విఘ్నేష్(32) అనే యువకుడు గోదావరిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం వెల్గటూర్ మండలం కోటిలింగాలలో చోటు చేసుకుంది. కరీంనగర్‌కు చెందిన దంపతులు శ్రీమంతుల విఘ్నేష్, శ్రీలతలు ఆదివారం మధ్యాహ్నం కోటిలింగాలలో పుణ్య స్నానాలు చేయడానికి గోదావరిలో దిగారు. ఈ క్రమంలో శ్రీమంతుల విఘ్నేష్ గోదావరిలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగి పోయాడు. భార్య కళ్ల ముందే రెండు సార్లు మునిగి తేలడంతో ఆమె కేకలు వేసింది. అక్కడ ఉన్న వారు గోదావరిలో ఎక్కడ చూసినా విఘ్నేష్ ఆచూకీ తెలియలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి గోదావరిలో వెతకగా విఘ్నేష్ మృత దేహం లభ్యమైంది. కళ్ల ముందే భర్త గోదావరిలో మునిగి మృతి చెందడం చూసి భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడి భార్య శ్రీమంతుల శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇల్లు దగ్ధం


దగ్ధమవుతున్న పెంకుటిల్లు

పాలకుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పెంకుటిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఏలుపుగొండ కొమురయ్య, సాయమ్మల ఇళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేరు. కొమురయ్య ఇంట్లో ఉన్న రెండు లక్షల 50 వేల నగదు, నాలుగు తులాల బంగారం, 30 తులాల వెండి కడియాలు, పట్టగొలుసులు, దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గమనించిన స్థానికులు పెద్దపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కొమురయ్య కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గడ్డి కోత యంత్రంలో చిక్కుకున్న బాలుడు..

- తీవ్ర గాయాలు.. కుడి చేయి తొలగింపు


చికిత్స పొందుతున్న బాలుడు

ఎల్లారెడ్డిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో బాలుడు నిమ్మంతుల సుదర్శన్‌రెడ్డి పశువుల షెడ్డు వద్ద ఉన్న గడ్డి కోత యంత్రంలో ప్రమాదవశాత్తు ఆదివారం చిక్కుకున్నాడు. తీవ్రగాయాల పాలైన బాలుడిని కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి కుడిచేయిని తొలగించారు. గ్రామంలోని రైతు నిమ్మంతుల రజిత-మధుకర్‌రెడ్డి దంపతుల కొడుకు సుదర్శన్‌రెడ్డి ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తన తాత మల్లారెడ్డితో కలిసి పశువుల షెడ్డు వద్దకు వెళ్లాడు. గడ్డికోసే యంత్రంలో గ్రాసం వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బాలుడు చిక్కుకున్నాడు. ఒక్కసారిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న తాత మల్లారెడ్డి, చుట్టుపక్కల రైతులతో కలిసి తీవ్రగాయాల పాలైన బాలుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కుడిచేయి పూర్తిగా నుజ్జునుజ్జు అవడంతో వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి చేయిని తొలగించారు.

మద్యం మత్తులో ఒకరిపై గొడ్డలితో దాడి

చందుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు గొడ్డలితో దాడి చేయడంతో మరో యువకునికి గాయాలైన సంఘటన చందుర్తి మండలం సనుగుల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కలిసి ఎల్లమ్మ గుడి సమీపంలో మద్యం సేవిస్తున్నారు. మద్యం సేవిస్తుండగా గొడవ తలెత్తడంతో నేరెళ్ల రాజుపై అదే గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే యువకుడు గొడ్డలితో దాడి చేయడంతో చేయి విరగడంతో పాటు వీపు భాగంలో గాయాలైనట్లు తెలిపారు. బాధితుడిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై అంజయ్య మాట్లాడుతూ 100కు డయల్ చేయడంతో అక్కడికి చేరుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

శంకరపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చింత చెట్టు పైనుంచి జారిపడి కింద పడడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన శంకరపట్నం మండలంలోని అర్కండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల గ్రామంలో చర్ల ఓదెలు తన ఇంటి ముందు ఉన్న చింతచెట్టు ఎక్కి చింతకాయలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. దీంతో ఓదెలు చాతికి బలమైన దెబ్బ తగిలింది. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉద్యమానికి ఊపిరిపోసిన కరీంనగర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె తారక రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కరీంనగర్ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ కరీంనగర్ అని, కేసీఆర్‌కు కరీంనగర్ అంటే సెంటిమెంట్ అని, ఇక్కడ ఏది ప్రారంభించినా అది సూపర్‌హిట్ అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బీఆర్ ఎస్ వజ్రోత్సవాల సందర్భంగా ఆదివారం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు చరిత్రాత్మక అవసరం అన్నారు. సన్నాహక సమావేశాన్ని చూస్తే బీఆర్ఎస్ ఎంత బలంగా ఉందో అర్థమవుతోందన్నారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో నిర్వహించిన సింహగర్జనతో ఉద్యమం ఊపందుకుంద న్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలతో తెలంగాణ వాదం కొట్టుకుపోయిందన్నారని, ఆ రోజున కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేస్తే కరీంనగర్ ప్రజలు రెండు లక్షల మెజార్టీతో గెలిపించి వాదాన్ని నిలబెట్టారని గుర్తుచేశారు. పదేళ్లలో తెలంగాణకు బీజేపీ ఇచ్చిందేమీలేదని, ఎంపీగా బండి సంజయ్ ఒక బడి, ఒక గుడి తేలేదని విమర్శించారు. టీటీడీ గుడి, బడి, మెడికల్ కాలేజీ, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ గంగుల కమలాకర్ తీసుకొచ్చారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గులాబీ జెండా ఎగురడం తథ్యమని, అన్నివర్గాల ప్రజలు కేసీఆర్ సీఎం కావాలని కోరుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మా గెలుపు కోసం కష్టించిన మీ కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించేందుకు ఎక్కువ కష్టపడుతామని, అన్నిరకాల అండగా ఉంటామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు కార్యకర్తలు, తెలంగాణవాదులు తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీశ్రేణులు, అభిమానులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు కరీంనగర్ అంటే సెంటిమెంట్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గడ్డ కరీంనగర్ అని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కేసీఆర్‌కు కరీంనగర్ అంటే సెంటిమెంట్ అని, అందుకే ఏది మొదలు పెట్టినా ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని అన్నారు. కరీంనగర్‌పై విశ్వాసంతో ఇదే జిల్లాలో రైతుబంధు, దళిత బంధు పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. అందుకే పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని ఇక్కడే ప్రారంభించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన మానేరు రివర్ ఫ్రంట్, తీగలవంతెనను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

● స్థానిక ఎన్నికల్లో గెలిపించుకుంటాం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

తమ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటామని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో అభిమానం తగ్గలేదని, వచ్చే ఎన్నికల్లో అన్నిస్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

● ఉద్యమాలు కొత్తకాదు

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తెలంగాణ బతుకులు పండాలని ఇక్కడి నుంచే ఉద్యమాన్ని ప్రారంభించామని, తెచ్చుకున్న రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఇప్పుడు మళ్లీ పోరాటం చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. పసిబిడ్డను కడుపులో ఉన్నపుడే కదిలించిన జెండా ఈ గులాబీ జెండా అని, ఉద్యమాలు మనకు కొత్త కాదని అన్నారు.

● అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

అమలుకు నోచుకోని ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కరీంనగర్ గడ్డ నుంచే మొదలైందని, ఇప్పుడు కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని కోరారు.

● మహిళలు రాజకీయాల్లోకి రావాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కేసీఆర్ పార్టీ పెట్టడంతో తనతోపాటు బాల్కసుమన్ వంటి నాయకులు చిన్నవయసులోనే ఎంపీలుగా గెలిచామని, మీలాంటి వారు కూడా ఇప్పటి నుంచే రాజకీయాల్లో చురుకుగా పాల్గొని ఎమ్మెల్యే, ఎంపీ పదవుల్లో రాణించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మహిళలకు 33శాతం చట్టం అమలులోకి వచ్చినందున రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ నాయకత్వంలో నాయకులుగా ఎదిగి సేవలు చేయాలని పిలుపునిచ్చారు.

వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ఘనత మాదే

- పెటా టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్



మాట్లాడుతున్న పి కృష్ణమూర్తిగౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 2013 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు అప్‌గ్రేడేషన్ ఇప్పించిన ఘనత పెటా టీఎస్‌దేనని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తిగౌడ్ అన్నారు. ఆదివారం నగరంలో కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌లో స్పోర్ట్స్ కోటాను అమలు చేయించా మన్నారు. దీంతో గ్రూపు-1, 2, 3, 4 ఉద్యోగాల్లో రెండు శాతం స్పోర్ట్స్ కోటా అమలవుతోందన్నారు. 2024 డీఎస్సీలో కూడా అన్నివిభాగాల్లో స్పోర్ట్స్ కోటాను అమలు చేయించామన్నారు. స్పోర్ట్స్ వెరిఫికేషన్ సరిగా చేయకుంటే, రీవెరిఫికేషన్ చేయించి మొదట ఇచ్చిన 24 ఉద్యోగాలతో పాటు 30 కొత్త ఉద్యోగాలను పెటా టీఎస్ ఇప్పించిం దన్నారు. వీరికి త్వరలో ఉద్యోగ నియామకపత్రాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. 2016 నుంచి జిల్లాలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులకు ఆన్‌డ్యూటీ సౌకర్యాన్ని ప్రభుత్వం తొలగించిందన్నారు. పెటా టీఎస్ ప్రభుత్వ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ప్రస్తుతం రాష్ట్రంలోని ఎస్‌జీఎఫ్ కార్యదర్శుం దరికీ ఆగస్టు 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌డ్యూటీ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. రాష్ట్రంలో 78 మంది వ్యాయామ ఉపాధ్యాయులు బీపీడీ పూర్తి చేసి ఉన్నారని, వారందరికీ త్వరలోనే ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్ కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. పెటాటీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను అర్హత గల వ్యాయామ ఉపాధ్యాయులతో భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వచ్చే డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుల 1700 పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. లెఫ్ట్ ఓవర్ వెకన్సీల్లో 38 మందికి ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పదోన్నతులను ఇప్పించామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్ష, కార్యదర్శు లు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్ పాషా, పెద్దపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వేల్పుల సురేందర్, దాసరి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ కడారి రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త బైక్ ఢీకొని.. మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు


కానిస్టేబుల్ పద్మజను పరామర్శిస్తున్న కేటీఆర్

కరీంనగర్ క్రైం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ పర్యటనలో భాగంగా కరీంనగర్‌లో చేపట్టిన బైక్ ర్యాలీలో ఓ బీఆర్ఎస్ కార్యకర్త బుల్లెట్ అదుపుతప్పి మహిళా కానిస్టేబుల్‌పైకి దూసుకెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం కరీంనగర్ శివారులోని వి-కన్వెన్షన్‌లో ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు కరీంనగర్ పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ వి-కన్వెన్షన్‌కు చేరుకున్న సమయంలో కార్ఖానగడ్డ ప్రాంతానికి చెందిన పుల్ల శ్రీకాంత్ బుల్లెట్ బైక్ అదుపుతప్పి అక్కడే విధినిర్వహణలో ఉన్న కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ గుండాల పద్మజ ఎడమకాలు పాదం పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె పాదంలో ఎముక విరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన శ్రీకాంత్‌పై కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసునమోదు చేశారు.

● కేటీఆర్ పరామర్శ

ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మహిళా కానిస్టేబుల్ గుండాల పద్మజను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. సమావేశం అనంతరం సాయంత్రం మహిళా కానిస్టేబుల్ పద్మజ చికిత్సపొందుతున్న ఆసుపత్రి కి వెళ్లారు. మహిళా కానిస్టేబుల్ వివరాలు తెలుసుకున్న కేటీఆర్ తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీలు బోయినిపల్లి, వినోద్‌కుమార్, బాల్క సుమన్, చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఉన్నారు.

విద్యార్థులకు వరం.. పీఎం ఇంటర్న్ షిప్ పథకం

దరఖాస్తుకు ఈ నెల 31 వరకు అవకాశం



గణేశ్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసీఏ) పీఎం ఇంటర్న్‌షిప్ పథకం-2025 సంవత్సరానికి నమోదు ప్రక్రియ ప్రారం భించింది. పరిశ్రమ అనుభవాన్ని పొందాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇది అద్భుతమైన అవకాశం. వివిధ రంగాల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం ద్వారా విద్య, వృత్తి పరమైన అనుభవం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం కార్యక్రమ లక్ష్యం. ఇందుకు **pminternship.mca.gov.in** వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని పలువురు విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది.

● ఉపాధి అవకాశాలు:

బీఏ, బీఎస్సీ, బీకాం వంటి సంప్రదాయ కోర్సులు చేసిన విద్యార్థులకు ఇతర వృత్తి విద్యా కోర్సుల మాదిరిగా.. ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. దీనికి ప్రధాన కారణం సంప్రదాయ కోర్సుల విద్యార్థులకు అనుసంధానంగా పరిశ్రమలు లేకపోవడం. ఇలాంటి విద్యార్థులు వారు చదువుకున్న కోర్సులకు సంబంధించిన పరిశ్రమల్లో శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించటం ఈ పథకం లక్ష్యం. నేరుగా పరిశ్రమలతో సంబంధం లేని విద్యార్థులకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకం కింద ఎంపికైన విద్యారుకు నెలకు ఐదు వేల రూపాయల చొప్పున 12 నెలల పాటు అభ్యర్థి ఆధార్ కార్డుకు లింక్ అయిన బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

● అర్హతలు..

ఈ పథకానికి 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులు. ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది. పదో తరగతి, ఐటీఐ, పదో తరగతి+సంబంధిత ట్రేడ్లలో ఐటీఐ డిప్లొమా, 12వ తరగతి లేదా యూజీసీ/ఏఐసీటీఈ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం ఎనిమిది లక్షల రూపాయల కన్నా తక్కువగా ఉండాలి ప్రొఫెషనల్ డిగ్రీలు (బీటెక్,ఎంబీఏ,సీఏ, వంటివి)కలిగిన వారు అర్హులు కారు. ఆధార్ కార్డు లేదా పాస్ పోర్టు వంటి ప్రభుత్వం గుర్తింపు కార్డు, మార్కుల జాబితా, ఇతర ధ్రువపత్రాలు, తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బయోడేటా, జనన ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకోవాలసి ఉంటుంది.

కొండగట్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పూజలు

మల్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి శాలువాతో రామకృష్ణను ఘనంగా సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే రసమయిపై సీపీకి ఫిర్యాదు


సీపీకి ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ కవ్వంపల్లి అనూరాధ

కరీంనగర్ క్రైం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తమ ఆసుపత్రులపై నిరాధారమైన ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భూపాలపల్లి, జమ్మికుంట సురక్షా ఆసుపత్రుల ఎండీ హరి ప్రసాద్ రెడ్డి, అంకిత్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ కవ్వంపల్లి అనురాధ ఆదివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జమ్మికుంట, భూపాలపల్లి ప్రాంతాల్లోని సురక్షా హాస్పిటల్, హైదరాబాద్‌లోని అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌పై రసమయి తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకిషన్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నిలువ నీడలేని రైల్వేస్టేషన్లు

- సౌకర్యాల ఏర్పాటులో రైల్వే అధికారుల నిర్లక్ష్యం
- జీఎంలకు వినతులు ఇచ్చినా స్పందన కరువు
- కానరాని తాగునీరు, మరుగుదొడ్లు
- ఎండ, వానలతో ప్రయాణికుల ఇబ్బందులు


ఎలాంటి నీడలేని ఓదెల రైల్వే స్టేషన్

ఓదెల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో పెనుమార్పులు సంభవించినప్పటికీ నేటికీ రైల్వేస్టేషన్లల్లో నిలువ నీడ లేకుండా పోయింది. రైల్వే జీఎంలకు వినతి పత్రాలు సమర్పించినా రైల్వేస్టేషన్ల స్థితిగతులు మారడం లేదు. ఓదెల, కొలనూర్, పొత్క పల్లి రైల్వేస్టేషన్ల ప్లాట్‌ఫామ్‌లపై నీడ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం ఇంటర్ సిటీ, సాయంత్రం సిర్పూర్ కాగజ్‌నగర్ రైళ్ల సమయంలో ఎండవేడికి ప్లాట్ ఫామ్‌లపై ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కనీసం తాగునీరు దొరకక ప్రయాణికులు తల్లడిల్లిపోతున్నారు. ఐదేళ్ల క్రితం ఈ మూడు రైల్వేస్టేషన్లలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి ప్లాట్‌ఫామ్, స్టేషన్లను ఆధునికీకరించారు. ప్లాట్‌ఫామ్‌లు నాసిరకంగా నిర్మించడంతో ఎత్తుఒప్పులుగా ఉండి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. సాగునీటి సౌకర్యం కోసం పాత ట్యాంకులు నీటి నల్లాలు ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు చుక్క నీరు రాలేదు. ఈ రైల్వే స్టేషన్లలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. ఎనిమిదేండ్ల క్రితం దివ్యాంగుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లను రూ.1.20 లక్షల వ్యయంతో నిర్మించి నప్పటికీ నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. ప్లాట్ ఫామ్‌ల ఆధుని కీకరణ, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటులో శ్రద్ధ కనబ రచడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తు న్నారు. పొత్కపల్లి, ఓదెల, కొల నూర్ రైల్వేస్టేషన్లల్లో మరమ్మ తుల పేరుతో నిర్వహించిన పను లను పర్యవేక్షించక పోవడంతో కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్ల పాలవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అజ్నీ ప్యాసింజర్, సిర్పూర్ కాగజ్‌నగర్, రైళ్ల హాల్టింగ్ ఇవ్వాలని, ప్రయా ణికులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రజా ప్రతినిధులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు జీఎంలకు వినతి పత్రాలు ఇస్తు న్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి రోజు వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఓదెల రైల్వే స్టేషన్ కు వస్తుంటారు. అలాగే వీరికి సరైన సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్లను ఆధునీకరణ చేపట్టాలని, రిజర్వేషన్, కంప్యూటరైజ్డ్ టికెట్ల సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


నీటి కనెక్షన్ లేని ట్యాంక్

తాగునీటికి ఇబ్బందులు

- బొంగోని రాజయ్య (కొలనూర్)



కొలనూర్ రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు తాగునీరు లభించడం లేదు. రైళ్ల రాకపోకల సమయంలో పరిసరాల్లోని గ్రామాల ప్రజలు ఇక్కడికే వస్తున్నారు. రోజు,రోజుకి ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. సౌకర్యాలతో పాటు అజ్నీ ప్యాసింజర్ రైలును హాల్టింగ్, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలి.

రైల్వే స్టేషన్లలో షెడ్డులను నిర్మించాలి

- మాచర్ల సదానందం , పొత్కపల్లి



ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నందున ఇబ్బందులకు గురి కాకుండా నీడ కోసం షెడ్లను నిర్మించాలి. వేసవి, వర్షాకాలం సమయంలో ప్రయాణికులు ఎండకు, వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలి.

ధర్మపురి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.98.26 లక్షలు

ధర్మపురి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఈనెల 10 నుంచి 22వరకు నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.98,26,635 ఆదాయం లభించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధరకాల పూజల టిక్కెట్ల ద్వారా రూ.26,54,646, ప్రసాదాల ద్వారా రూ.26,66,465 లభించినట్లు ఆయన పేర్కొన్నారు. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ.7,02,896 ఉండగా హుండీ ద్వారా 38,02,628 ఆదాయం ఉన్నట్లు వారు వివరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగనీయకుండా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు, సూచనల మేరకు వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

కొండగట్టులో దీక్షాపరుల సందడి


దీక్షలు స్వీకరించి హనుమాన్ జపం చేస్తున్న భక్తులు

మల్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో ఆదివారం పలువురు భక్తులు హనుమాన్ దీక్షలు స్వీకరించడంతో సందడి నెలకొంది. వచ్చే నెల 13న హనుమాన్ జయంతి నేపథ్యంలో 21రోజులు అర్ధమండలం దీక్షలను వందలాదిగా స్వీకరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


ఆంజనేయస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

10 సంవత్సరాలు ఏం చేశారో చెప్పకుండా విజయోత్సవాలా?

- మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, మార్చి 23, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా విజయోత్సవాలు జరుపుకుంటారా అని రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్‌ఎస్‌ను విమర్శించారు. మండలం కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక సంక్షోభానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమానికి నాందిపలికిన కరీంనగర్‌కు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందో చెప్పాలన్నారు. కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు కరీంనగర్ ప్రజలు గెలిపిస్తే కరీంనగర్‌కు మెడికల్ కళాశాల ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కరీంనగర్, రామగుండం రాజీవ్ రహదారిని ఎనిమిది లైన్‌లుగా ఎందుకు మార్చలేదని, శాతవాహన యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల పెట్టాలని తీర్మానం చేసినా ఎందుకు పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలకు డిలిమిటేషన్‌లో అన్యాయం జరుగుతుందని, 1971 జనాభా లెక్కల ప్రకారం డిలిమిటేషన్ చేయాలన్నారు. రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. డిలిమిటేషన్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నది సరికాదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిపోయిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకొని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్ది పోచమ్మ వారికి నైవేద్యం వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలలో సూపరింటెండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రేపు, ఎల్లుండి సాహిత్య సమాలోచన జాతీయ సదస్సు

సిరిసిల్ల రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సిరివెలుగులు సాహిత్య సమాలోచన జాతీయ సదస్సును రెండురోజుల పాటు అగ్రహారం డిగ్రీ కళాశాలలో ఈ నెల 25, 26 తేదిలలో ఏర్పాటుచేశామని కార్యక్రమ కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎలగొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు.

భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారంలో మానేరు రచయితల సంఘం, సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సులో రచయితలు డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం పాల్గొంటారని, కార్యక్రమ నిర్వాహకులుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి శంకర్, కో కన్వీనర్‌గా తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కటకం శారద, కో కన్వీనర్ డాక్టర్ రొండి అర్జున్, సహ సంచాలకులు డాక్టర్ సిరిసిల్ల చందన, మానేరు రచయితల సంఘం అధ్యక్షులు టివి నారాయణ, కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధానకార్యదర్శి అడెపు లక్ష్మణ్, అనిత మాడూరి పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు కవులు, రచయితలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాలుగో తరగతి ఉద్యోగులపై పని భారం

- భారీగా తగ్గిన అటెండర్లు
- సమస్యలతో సతమతమవుతున్న చిరుద్యోగులు




సుభాష్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాల మొదలుకొని కలెక్టర్ కార్యాలయం వరకు అన్ని ప్రభుత్వ సంస్థల్లో నాలుగో తరగతి ఉద్యోగుల పాత్ర కీలకం. ప్రభుత్వం అటెండర్ పోస్టుల నియామకం చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఉన్న వారిపై పనిభారం పడుతోంది. దీంతో వారు మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతూ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది వేలకు పైగా అటెండర్లు ఉండేవారు. ప్రస్తుతం మూడు వేల మంది మాత్రమే ఉన్నారు. జిల్లాల విభజన తర్వాత బదిలీలు చేయడంతో జిల్లా కేంద్రంతోపాటు కొత్త జిల్లాలు, మండలాల్లో పనిచేస్తున్న అటెండర్లపై పని భారం మరింతగా పెరిగింది. కొన్ని పాఠశాలల్లో అటెండర్లే లేరు.

● ఏళ్లుగా రిక్రూట్‌మెంట్ లేక ఇబ్బందులు

తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు అటెండర్లు, ఒక వాచ్‌మెన్, ఒక స్వీపర్ ఉండాలి. హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యను బట్టి నలుగురు నుంచి ఆరుగురు అటెండర్లు ఉండాలి. కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో వంద మంది నాలుగో తరగతి ఉద్యోగులు పని చేయాలి. ప్రస్తుతం 15 మంది మాత్రమే పని చేస్తున్నారు. జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో 10 మంది అటెండర్లకు ఉండాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. పశువుల ఆసుపత్రుల్లో అటెండర్లే లేరు. జిల్లాల విభజన తరువాత కొత్త ఉద్యోగాల భర్తీ లేదు. దీంతో ఉన్నవారిపై పనిభారం పడి అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నాలుగో తరగతి ఉద్యోగులు కోరుతున్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

- కోట రామస్వామి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు



జిల్లాల విభజన తరువాత కొత్తగా ఉద్యోగాల భర్తీ లేదు. ఉద్యోగ విరమణ తరువాత ఆస్థానంలో కొత్తగా నియమకం చేపట్టడం లేదు. పశు సంవర్థక శాఖలో నాలుగో తరగతి ఉద్యోగులు లేరు. ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలి. 30 సంవత్సరాలుగా ప్రభుత్వాలు నాలుగో తరగతి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. స్వంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నాలుగో తరగతి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి

- వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రూ. 2.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

వేములవాడ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరులో ముంపుకు గురైన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని 11 గ్రామాలలో రూ. 2.25 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు డ్యామ్‌లో ముంపునకు గురైన నిర్వాసితుల సమస్యలను దగ్గరుండి చూసానని, సమస్యల పరిష్కారం కోసం వారితో కలిసి పోరాటం చేసినవాడినని గుర్తు చేశారు. ప్రభుత్వం దృష్టికి నిర్వాసితుల సమస్యలను పలుమార్లు తీసుకువెళ్లానని, త్వరలోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ప్రజాపాలనలో ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ముడికే చంద్రశేఖర్ యాదవ్, గాలిపెల్లి స్వామి, కత్తి కనుకయ్య తదితరులు ఉన్నారు.


మారుపాకలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వృద్ధుల సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి

జగిత్యాల అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమం, సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం వృద్ధుల సంక్షేమ కమీషన్ ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రలోని సీనియర్ సిటీజన్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరాధరణకు గురవుతున్న వృద్ధుల హక్కుల పరిరక్షణ, పునరావాసం, భద్రతకు సమాజహితానికి వారి నైపుణ్యాలను ఉపయోగించుకోవడం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కమిషన్ ఏర్పాటు చేయడం ద్వారా వృద్ధులకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సీనియర్ సిటీజన్ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, పబ్బా శివానందం, ఒజ్జల బుచ్చిరెడ్డి, కండ్లె గంగాధర్, పుప్పాల నర్సింగారావు, కరుణ, వేముల దేవరాజం, విజయలక్ష్మి, శ్రీమంజరి, రాధ, జలజ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

- మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం - హాజరైన మూడు డివిజన్ల డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు

గంగాధర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధరలో ఆదివారం గంగాధర, సిరిసిల్ల, మల్యాల మిషన్ భగీరథ, పంచాయతీరాజ్‌శాఖ సబ్ డివిజన్ల డీఈలు, ఏఈలు, ఆరు మండలాల ఎంపీడీవో, ఎంపీవోలతో తాగునీరు, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల పరిధిలోని ఆరు మండలాల్లో ఏఏ గ్రామాల్లో తాగునీటికి సమస్యలున్నాయి, శాశ్వత పరిష్కారానికి ఎన్ని కొత్త బోర్లు, కొత్త బావుల తవ్వకాలు, పైపులైన్ల నిర్మాణం అవసరముంది, గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఏదశలో ఉన్నాయని వివరాలను ఎమ్మెల్యే అడిగారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం 40 వేల కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం గ్రామాల్లో తాగునీను అందించడంలో విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తాగునీటికి మొదటి ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో రెండు రోజులు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అవసరమున్న చోట్ల తాగునీటి శాశ్వత పరిష్కారానికి బావులు తవ్వడం, బోర్లు వేయించడం, కొత్త పైపులైన్లు, గేట్ వాల్వ్‌లు, బోర్ల ఫ్లషింగ్ వంటివి పూర్తి చేయడానికి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గంగాధర, సిరిసిల్ల, మల్యాల సబ్ డివిజన్ల మిషన్ భగీరథ డీఈలు విశాంత్, వినయ్, పీఆర్ డీఈలు రాజేంద్రప్రసాద్, విష్ణు, చంద్రశేఖర్, ఆరు మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

● తాగునీటి సమస్య గ్రామాలు:

నియోజకవర్గంలో ఆరు మండలాల్లో తాగునీటి సమస్యలున్న గ్రామాల వివరాలను, పరిష్కార మార్గాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. చొప్పదండి మండలంలో భూపాలపట్నం, కోనేరుపల్లి, గుమ్లాపూర్, కాట్నపల్లి గ్రామాల్లో వేసవి తాగునీటికి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ గ్రామాల్లో అవసరమైన బావులు, బోర్లు, పైపులైన్ల నిర్మాణం అత్యవసరమని ఎమ్మెల్యేకు తెలిపారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట మంచినీటి బావి నుంచి పైపులైను వేస్తే పెద్ద గ్రామానికి నీటి సమస్య తీరుతుందన్నారు. కొరటపల్లి ఎస్సీ కాలనీకి పైపులైను లేక నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెదిర బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు ప్రభుత్వ పాఠశాల వరకు పైపులైనులేదని ఏఈ తెలిపారు.

● గంగాధర మండలం సర్వారెడ్డిపల్లికి పెండలోనిపల్లె బావి నుంచి నీరు సరఫరా అయ్యేది. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడిన తరువాత ఆ గ్రామానికి నీరు సరిపోవడంలేదని బంద్ చేయడంతో సర్వారెడ్డిపల్లికి వేసవిలో నీటి సమస్య తప్పడం లేదు. హిమ్మత్‌నగర్‌లో పాతపైపులైను కావడంతో తరుచు లీకేజీల సమస్యతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పాడుతోంది.

● కొడిమ్యాల మండలంలోని దమ్మన్నపేట, శనివారంపేట, రాంపూర్ గ్రామాల్లో బోర్లు వేసినా నీరుపడే పరిస్థితి లేదని, వేసవిలో వ్యవసాయ బావులను అద్దెకు తీసుకుని నీరందిస్తున్నామని ఏఈ తెలిపారు. ఈ గ్రామాలకు బల్క్ వాటర్ అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎమ్మెల్యేకు వివరించారు. బోయినపల్లి, మల్యాల మండలాల్లో మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

కమాన్‌పూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీఆదివరాహ స్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 30న నిర్వహించే ఉత్సవాలకు హాజరు కావాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి కొసన కాంతారెడ్డి, ఆల య అర్చకులు కలకుంట్ల వరప్రసాద చార్యులు మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన శ్రీధర్‌బాబు

మంథనిరూరల్, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పోతారం, విలోచవ రం గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం పరామర్శించారు. పోతా రంలో మాజీ సర్పంచ్ ఎడ్ల సత్యనారా యణ, ఎడ్ల శ్రీనివాస్‌ల తల్లి వెంకటమ్మ, విలోచవరంలో కోరవేన సాయితేజ, దేవరకొండ లక్ష్మిలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించి సాను భూతి వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, శశిభూషణ్ కాచే, ఉప్పట్ల శ్రీనివాస్, ఆరెల్లి కిరణ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ

సుల్తానాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం వంట పాత్రలను ఆదివారం అందజే శారు. మండలంలో 37 ప్రభుత్వ పాఠశా లలకు వంట పాత్రలు వచ్చాయని, ఆయా పాఠశాలలకు అప్పగించామని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి పాత్రలు వచ్చాయన్నారు. కొన్నేళ్ళుగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు కిరాయికి తెచ్చిన పాత్రల ద్వారా వంటలు చేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వం సరిపడ పాత్రలు పంపిణీ చేసిందన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

సుల్తానాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలనతో పాటు రైతు ప్రభుత్వం కొనసాగుతుం దని రైతుల సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. చిన్నకలువల సహకార సంఘం పాలకవర్గం సమావేశం ఆదివారం సింగిల్ విండో చైర్మన్ మోహన్ రావు అధ్యక్షతను జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రైతుల సమస్యల పరిష్కారానికి, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరిం చారు. గత ప్రభుత్వ హయాంలో అనేక అవినీతి అక్ర మాలు చోటు చేసుకున్నాయని, ఈ గ్రామంలోని చెరువు మట్టిని అమ్ముకున్నారని ఆరోపించారు. గ్రామంలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని రైతులు కోరగా అందుకు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. గోదాము నిర్మించి రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచేం దుకు దేవునిపల్లిలో ఆరు గుంటల స్థలాన్ని మంజూరు చేయాలని చైర్మన్ అడుగగా మంజూరు చేస్తామన్నారు. పాలకవర్గం వ్యయ ఆదాయాలను సీఈఓ రమేష్ చదివి వినిపించారు. ఎమ్మెల్యేను ఘనంగా సన్మానిం చారు. మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సుగుణాకర్‌రావు, మురళీధర్ రావు, రమేష్, సొసైటీ వైస్‌చైర్మన్ కందుల రాజు, డైరక్టర్లు గుర్రం సత్తయ్య, అంజయ్య, లింగయ్య, ఈరయ్య, శ్రీకాంత్, పద్మ, నిర్మల, మాధవరావు, సం పత్, విజయ్, సిబ్బంది పర్శరామ్, సంపత్, వినోద్, శివరామక్రిష్ణ, సురేష్, సంపత్, సతీష్ తో పాటు రైతులు నాయకులు కృష్ణారావు,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఖనిలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌పై అనుచిత వ్యాఖ్య లు చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆదివారం ఎన్ఎస్‌యూఐ నాయకుడు దాసరి విజయ్ ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తాలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు గోదావరి గోస పేరుతో పాదయాత్ర చేశారని, గోదావరి ఎండిపోవడానికి కారకులు బీఆర్ఎస్ నాయకులన్నారు. గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కృంగి పోయాయని, బీఆర్ఎస్ నాయకుల అవినీతి వల్లనే లక్షల కోట్ల ప్రజాధనాన్ని ప్రాజెక్టుల పేరుతో దోచుకు తిన్నారన్నారు. గోదావరిలో నీరు నిల్వ చేస్తే సుందిళ్ల, మేడిగడ్డ ప్రాజెక్టులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతా యన్నారు. రామగుండాన్ని రూ.500కోట్లతో సుందరంగా తీర్చిదిద్దమే లక్ష్యంగా మక్కాన్‌సింగ్ పెట్టుకున్నారని, ఎమ్మెల్యేపై అవాకులు చెవాకులు చేస్తే సహించబోమని, గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పినా మారడం లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, కొలిపాక సుజాత, తిప్పారపు శ్రీనివాస్, ఎండీ ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, కొటం సతీష్, చుక్కల శ్రీనివాస్, కొప్పుల శంకర్, అనుమ సత్యనారాయణ, అల్లి శంకర్, ఉదయ్ రాజ్, మీసాల సతీష్, మాలెం మధు, కొమ్ము వేణు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న ముఖ్య కార్యకర్తల సభకు ఆదివారం మండలంలో నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ వైస్ ఎంపీపీ కొట్టె భూమయ్య, మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

లక్ష్మీపురంలో వైద్య శిబిరం

కోల్‌సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురంలో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్, రోహిణి ఫౌండేషన్ సహకారంతో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. గొంతు, దంత, రక్తపోటు, క్యాన్సర్‌కు సం బంధించిన పరీక్షలు నిర్వహించారు. గొంతు, దంత, రక్తపోటు, క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు. ఎన్‌టీపీసీ ప్రభావిత ప్రాంతమైన లక్ష్మీపురంలో నిత్యం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ఎన్‌టీపీసీ యాజమాన్యం ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు డీసీసీ అధికార ప్రతినిధి కందుల సతీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఉచితంగా మందులు, కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు మాధవరావు, సందెవేన శ్రీనివాస్, సంతోష్, సునీల్, శ్రీనివాస్, రాజేందర్, మెండె మహేందర్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఎన్‌టీపీసీలో ఉద్యోగాలు ఇప్పించండి

మార్కండేయాకాలనీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రామ గుండం ఎన్‌టీపీసీ నిర్మాణాల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రాజెక్టులో పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిం చాలని భూనిర్వాసితుల సంఘం ప్రతనిధులు బయ్యపు ప్రభంజన్‌రెడ్డి, ఆజాముద్దీన్, శంకరయ్యలు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజే శారు. 17 గ్రామాల్లో 10300ఎకరాలు ఎన్‌టీపీసీ నిర్మాణా నికి సేకరించారని, 50ఏళ్ల క్రితం మొక్కుబడిగా ఎకరానికి రూ.3600 పరిహారం ఇచ్చారన్నారు. భూమి పత్రం ఉన్న నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తరువాత చేతులెత్తేశారన్నారు. రామగుండం ఎన్‌టీపీసీలో ప్రస్తు తం 216ఖాళీలు నిర్వాసితులకుఇవ్వాల్సి ఉందన్నారు. ఢిల్లీ నుంచి అప్రువల్ రావాలని ఎన్‌టీపీసీ తప్పించుకుం టుందన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఎన్‌టీపీసీ అధికారులతో మాట్లాడుతానని హామి ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు


మంథనిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఖనిలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

మంథని, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో మంత్రి శ్రీధర్‌బాబు మంథని పట్టణంలో ఆది వారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశా రు. అనంతరం ఉపవాసాలు చేపట్టిన ముస్లింలతో దీక్షలు విరమింపజేశారు. ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక రంజాన్‌పండగ అన్నారు. ముందస్తుగా ముస్లిం సోదరులకి రంజాన్ శుభా కాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నేతలు వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, రమ-సురేష్‌రెడ్డి, శశిభూషణ్ కాచే, ఐలి ప్రసాద్, కిషన్‌జీ, లింగయ్యయాదవ్, వెంకన్న, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఈద్గా లు, కబరస్తాన్‌ల అభివృద్ధికి రూ.8కోట్ల నిధులను కేటా యించినట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, నియోజకవర్గంలో షాదీఖానాలు, కబరస్తాన్, ఈద్గాల కు నిధులు తీసుకువచ్చినట్టు తెలిపారు. తహసీ ల్దార్ కుమారస్వామి, నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఆసీఫ్, ఫజల్ బేగ్, నాజీమోద్దీన్, గుండేటి రాజేష్, ఫక్రుద్దీన్, అల్లి శంకర్, సాంబమూర్తి పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): మైనార్టీల అభి వృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రానున్న రోజుల్లో యువ వికాసం ద్వారా మైనార్టీ యువకుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే చింత కుంట విజయరమణారావు అన్నారు. ఎంబీ గార్డెన్లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లిం అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషిచేస్తుందని, పట్టణంలో ముస్లింల శ్మశానవాటికకు రాఘవాపూర్ సమీపంలో రెండు ఎకరాల స్థలం కేటాయించి అభివృద్ధికి నిధులు విడుదల చేశామని, పేద ముస్లిం సోదరుల కోసం రాజీవ్‌యువవికాసం ద్వారా ఆర్థిక అభివృద్ధి తోడ్పాటు జరుగుతుందని తెలిపారు. ఇండ్లులేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని తెలిపారు. ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మంథని సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంథని, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ హెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో 2001-2002లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఎస్ఎల్‌బీ ఫంక్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళనాన్ని జరు పుకున్నారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. విద్య నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంజాయ్ చేశారు. ఉపాధ్యాయులు అల్లం వీరయ్య, పవిత్రం భూమయ్య, భగవతుల శంకర్, గీట్ల భరత్‌రెడ్డి, నారంభట్ల సుశీల, గనుకోట సునీత, విద్యార్థులు గొబ్బూరి వంశీ, బండారి సమ్మయ్య, రావుల సతీష్, పెంటరి సంతోష్, రావికంటి రాకేష్, మీసాల రాజు, మధూకర్, సంతోష్, రవిలు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్ర జ్యోతి): గోదావరిఖని మా ర్కండేయకాలనీలోని ప్రగతి హైస్కూల్ 2007-08 బ్యాచ్ చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ నం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ ఫం క్షన్ హాల్‌లో జరిగిన ఈ అపూర్వ సమ్మేళనంలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చదు వు చెప్పిన గురువులను సన్మానించారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ప్రధానోపా ధ్యాయులు పీ దేవేందర్‌రెడ్డి, ఉపా ధ్యాయులు ఏ బాలరాజు, శ్రీనివాస్, వరుణ్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రామ గుండంలో పలు అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మె ల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ ప్రారంభించారు. గోదావరినది తీరంలో సమ్మక్క - సారలమ్మ గద్దెల వద్ద రూ.3కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎకో పార్కు, రోడ్లు, స్నానఘట్టాలు, మరు గుదొడ్లు, సైడ్‌వాల్స్, పుష్కర ఘాట్‌లను, రూ.98లక్షలతో ఫోరింక్లయిన్ వద్ద ఉన్న కబరస్తాన్‌లో పనులకు శంకు స్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్, సింగరేణి ద్వారా అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నా యని, ఇటీవల రూ.15కోట్లతో చౌరస్తాలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు రోడ్ల విస్తరణ, విద్యుత్ దీపాల పనులను చేపట్టినట్టు తెలిపారు. సమ్మక్క - సారలమ్మ జాతరకు హాజరయ్యే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది జరిగే జాతరకు భక్తులకు మౌలిక సదు పాయాలు కల్పించే లక్ష్యంగా ఏర్పాట్లను చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీ ఎం(పర్సనల్) కిరణ్‌బాబు, జితేందర్‌సింగ్, వర ప్రసాద్, వసంతకుమార్, కుమారస్వామి, రాజు, దుర్గాప్రసాద్, వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, పొలసాని శ్రీనివాస్, పెండ్యాల మహేష్, గట్ల రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ను క్యాంప్ ఆఫీస్‌లో సన్మానించారు. రాష్ట్ర శాసనసభలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ తీసుకురావడంపై అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ ఆర్డినె న్స్‌లో ఎమ్మెల్యే సహకారం మరువలేనిదని అసోసి యేషన్ జనరల్ సెక్రెటరీ సొప్పదండి దుర్గాప్రసాద్ తెలిపారు. బొంకూరి మోహన్, శ్రావణ్‌కుమార్, రామ గిరి రమేష్, లక్ష్మీరాజం, రాములు, అడ్డాపురం చంద్ర మౌళి, కిష్టయ్య, శంకర్‌లు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి సర్దార్ భగత్‌సింగ్



ఎన్టీపీసీలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ర్యాలీ

కళ్యాణ్‌నగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భావితరాలకు స్ఫూర్తి సర్దార్ భగత్‌సింగ్ అని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు, గౌతం గోవర్ధన్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భాస్కర్‌రావు భవన్ నుంచి చౌరస్తా వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఉరితాడును ముద్దాడిన యోధులు సర్దార్ భగత్‌సింగ్ అన్నారు. బ్రిటీష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోషిక మోహన్, ఆరెల్లి పోషం, కుమార్, రంగు శ్రీను, రేణికుంట్ల ప్రీతం, చంద్రశేఖర్, ఓదమ్మ, రమ, సుధీర్, సుజాత, రేణుక పాల్గొన్నారు.

పీవైఎల్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, ధర్మేందర్‌లు మాట్లాడుతూ భారతమాత విముక్తి కోసం ముగ్గురు ఉరికొయ్యలను ముద్దాడారన్నారు. ఈదునూరి నరేష్, రామకృష్ణ, రాజేష్, మొగిలి, కొమురయ్య, చంద్రయ్య, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): కొలనూర్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజగురు, సుగుదేవుల వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమా లలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. నేటి పాలకులు అనుసరిస్తున్న మత చాందసవాద విధానాలు ప్రజలకు ప్రమాదకరంగా మారాయని అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు తాళ్లపల్లి సురేందర్, సాతూరి అనిల్, నరేష్, అభిలాష్, రమేష్, శ్రీనివాస్, మహేష్, దిలీప్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగ త్‌సింగ్ వర్ధంతిని ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యాలయం నుంచి షిర్కే చౌరస్తా వరకు క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌరస్తా లో మానవహారంగా ఏర్పడి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివా


కొలనూర్ లో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ళులర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో సమాజంలో అక్రమాలను ఎదుర్కోవా లని నాయకులు పిలుపునిచ్చారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్, కాంతయ్య, ప్రేమ్‌కుమార్, వేముల రమేష్, కే మల్లయ్య, లింగయ్య, నారాయణ, లింగయ్య పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ వర్ధంతిని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ, ఐఎఫ్టీయు ఎన్టీపీసీ కార్యవర్గం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్టీయు కార్యాలయం నుంచి మేడిపల్లి సెంటర్ వరకు కాగడాలతో ప్రదర్శన చేశారు. నాయకులు చిలుక శంకర్, బుచ్చన్న, రాయమల్లు, రాజయ్య, రవి, రమేష్‌సత్యం, నర్సయ్య, రవి, వసంత్, రమేష్ సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే వ్యవసాయ యాంత్రీకరణ

(5వ పేజీ తరువాయి)

వ్యతిరేకత పెరిగింది. పరిస్థితి గమనించిన ప్రభుత్వం 2017-18 వరకే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసాగించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రెండోసారి గెలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అటకెక్కించింది. కనీసం కేంద్ర ప్రభుత్వం ఆర్‌కేవీవై ద్వారా కేటాయించిన నిధులను సైతం సద్వినియోగం చేసుకోలేక పోయింది. 2018 యాసంగి సీజన్ నుంచి రైతుబంధు పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చింది. వ్యవసాయ యాంత్రీకరణ, జీరో వడ్డీకే పంట రుణాలు, పంటల బీమా పథకాలను అమలు చేయలేదు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారం లోకి వస్తే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమ ల్లోకి తీసుకవస్తామని ప్రకటించింది. ఆ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం రూ.24 కోట్ల 90 లక్షల సబ్సిడీ నిధులను కేటాయించింది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు రూ. 58.84 లక్షలు కేటాయించారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ నెల చివరి వారంలో ఉగాది పండుగ నేపథ్యంలో ముందస్తుగా వివిధ ప్రాం తాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. ఆలయంలో పూజలు నిర్వహించి ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. కోడె మొక్కులను, బోనాలను సమర్పించారు. భక్తు లు మదన పోచమ్మ, బంగారు పోచమ్మలను దర్శించుకొని మొక్కులు సమర్పించారు.

సామాజిక విప్లవకారులు అంబేద్కర్, పూలే

కోల్‌సిటీటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్, పూలేలు సామాజిక విప్లవకారులని నాయకులు గంగారపు లింగమూర్తి, క్యాతం వెంకటరమణలు పేర్కొన్నారు. ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఖనిలో పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం జరిగింది. దళిత, స్వచ్ఛంద సంఘాలు, వివిధ పార్టీల నాయకులు అంబే ద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబే ద్కర్ కృషి ఫలితంగా దేశ రాజ్యాంగం నిర్మితమైందని వక్తలు పేర్కొన్నారు. మైస రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో తీట్ల రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, బొంకూరి మధు, లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, కరీం, చంద్రశేఖర్, రామస్వామి, పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, మార్చి23(ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ కళాశాలలో కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తున్న కాంట్రా క్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, స్కావెంజర్లకు జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా నెలకు రూ.11,005మాత్రమే చెల్లిస్తూ ఆర్థిక శ్రమదోపిడీ చేస్తున్నారని, ఇప్పటి వరకు కార్మికులకు ఎంత పీఎఫ్ కట్ చేస్తున్నారో చెప్పడం లేదని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వడం లేదని, పండుగ అడ్వాన్స్, బోనస్ చెల్లించడం లేదని, షిఫ్టులు చేస్తే కనీసం విశ్రాంతి కూడా ఇవ్వడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న కాంట్రాక్టు సొసైటీని రద్దు చేయాలని, దీనిపై ప్రిన్సిపాల్ హిమబిందుతోపాటు లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంథని అభివృద్ధి శ్రీధర్‌బాబుతోనే సాధ్యం

రామగిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతం అభి వృద్ధి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోనే సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు తొట్లతిరుపతియాదవ్ అన్నారు. ఆదివారం ఐఎన్‌టీయుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిం దని ఆరోపించారు. మతిభ్రమించి అవివేకమైన నిరాశ్రయులు ఉనికి కోసం మంథని ప్రాంత ప్రజలను మభ్యపెట్టేందుకు పాట్లు పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ళలో రామగిరి ఖిల్లా అభివృద్ధి పట్టించుకోని నాయకులు ఇప్పుడు మాట్లాడడం అవివేకానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో కమీషనర్లకు కక్కుర్తిపడి మేడలు కట్టుకోవడం అభివృద్ధి కాదని గుర్తు చేశారు. దుద్దిళ్ల కుటుంబం పై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లికి చెందిన అనసూయ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పందించి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 75వేల రూపాయల చెక్కును ఆదివారం బాధితురాలు కుటుంబ సభ్యులకు పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోల్సాని సునీల్‌రావు, ఆరెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దపల్లి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీలకు ప్రత్యేక రిజర్వేషన్ బిల్లును ఆమోదించినందుకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మండలంలోని పెద్దకల్వల గ్రామంలో కల్వల భూమేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు కల్వల మల్లేష్, కల్వల సతీష్, కల్వల విజయ్, కల్వల రవిందర్, రమేష్, రాజు, రవి, గోపాల్, శ్రీనివాస్, సారయ్య, చంద్రయ్య, రాజేశం, జయరాజ్, మోజేస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్

పెద్దపల్లి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆశా వర్కర్లు ఛలో హైదరబాద్ నిర్వహించగా బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపల్లి మండల ఆశవర్కర్‌లను ఎస్ఐ స్వామి సిబ్బందితో ఆదివారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఆశవర్కర్‌లు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఆశవర్కర్‌లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం అందిస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చార న్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆశవర్కర్‌లకు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు, సమస్యలపై చర్చించాలని ధర్నా చేపట్టినట్లు తెలిపారు. తమ న్యాయమైనా డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అకాల వర్షంతో వరికి చీడపీడల బెడద

ఓదెల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో వరికి చీడ పీడల బెడద సోకుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా పురుగుల మందును పిచికారి చేయడంలో బిజీ అయ్యారు. అకాల వర్షంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో వరి పంటలకు దోమలు, మొగి పురుగుల బెడద అధికమైంది. రైతులంతా పెస్టిసైడ్స్ షాపులకు తరలివెళ్లి పురు గుల మందులను కొనుగోలు చేస్తున్నారు. దోమలు, పురుగులతో రైతులకు యుద్ధం తప్పడం లేదు.